సాక్షి కామారెడ్డి

మంగళవారం । 8 । జూలై । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 107 ఫిర్యాదులు నమోదయ్యాయి. భూ సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులొచ్చాయి.

- 8లో ▸



పురుగుల అన్నం..

అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల విద్యార్థులు సోమవారం రాస్తారోకో చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.5 /22.5

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకుని, అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

యూరియా కొరత లేకుండా చూడాలి



రాజంపేట: యూరియా కొరత లేకుండా చూడాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా విత్తన ప్రముఖ్ భైరవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాజంపేటలోని రైతు వేదికలో బీకేఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరి పంటరుణాలను మాఫీ చేయాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ నూతన కార్యదర్శిగా కృష్టారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సదాశివనగర్: అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అర్చకులు కమిషనర్‌తో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెండు జిల్లాల అర్చక సంఘ అధ్యక్షులు అంజనప్ప, రాచప్ప, ఆలయాల కమిటీల చైర్మన్లు బీరయ్య, రవి, రాజయ్య, స్థానిక అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ, జంగం గంగాధర్, ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా అజ్మతుల్లా

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జిగా వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అదనపు ఎస్పీ బదిలీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

వైద్య సేవల్లో జిల్లా ఫస్ట్

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులలో ఆయా వైద్య సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 22 పీహెచ్‌సీలలో గతనెలలో ఓపీ సేవలను 25,152 మంది వినియోగించుకున్నారని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో 5,232 మంది రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారన్నారు. 21,539 మంది ఔషధ సేవలు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలలో కామారెడ్డి జిల్లా జూన్ మాసంలో వైద్య సేవలకు సంబంధించి మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

జుక్కల్ అభివృద్ధి.. నా బాధ్యత

- రెండుమూడేళ్లలో రూపురేఖలు మారుస్తా
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

నిజాంసాగర్/బిచ్కుంద: వెనకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటున్నానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో రెండుమూడేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ఆయన నియోజకవర్గంలో పర్యటించారు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జుక్కల్ మండలం కేంరాజ్ కల్లాలి వద్ద నాందేడ్ - సంగారెడ్డి జాతీయ రహదారి పక్కన మంత్రి మొక్కలు నాటి వన మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. పిట్లం, బిచ్కుంద మండలాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. బిచ్కుంద - డోంగ్లీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం బిచ్కుందలోని బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారం అనుభవించిన ఈ ప్రాంత మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉత్సాహంగా పనిచేస్తున్నారన్నారు. బిచ్కుంద -కుర్లా వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 13.2 కోట్లు మంజూరు చేశామన్నారు. శాంతాపూర్ నుంచి దడ్గి వరకు రోడ్డుకు రూ. 20 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. మేనూర్ నుంచి డోంగ్లీ వరకు రోడ్డుకు రూ. 7.5 కోట్లు, అన్నాసాగర్ నుంచి జుక్కల్ రోడ్డుకు రూ. 10 కోట్లు, జుక్కల్ నుంచి మద్నూర్ వరకు రూ. 10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బిచ్కుంద, పిట్లం, జుక్కల్, డోంగ్లీ మండలాల్లో 6 విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయిస్తానన్నారు. బిచ్కుంద, పిట్లం మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయిస్తానన్నారు. త్వరలోనే జుక్కల్‌కు ముఖ్యమంత్రిని తీసుకువస్తానన్నారు.



హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద మంత్రికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం

పిట్లం: తిమ్మనగర్ శివారులోని నల్లవాగుపై రూ. 4.86 కోట్లతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పిట్లం మండలానికి విచ్చేసిన మంత్రికి అధికారులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంత్రి స్థానిక నాయకులతో మాట్లాడారు.

గత ప్రభుత్వం అన్యాయం చేసింది..

గత ప్రభుత్వం జుక్కల్ నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా అన్యాయం చేసిందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆరోపించారు. నియోజకవర్గానికి అవసరమైన రోడ్లు, ప్రాజెక్టులు, సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. లెండి ప్రాజెక్టుతోపాటు నాగమడుగు ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, మనోజ్ పటేల్, మల్లికార్జున్, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్ దేశాయ్, మల్లికార్జునప్ప షెట్కార్, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్ పటేల్, నాగ్‌నాథ్, షేక్ అజీం లాలా, గంగాధర్, రవి పటేల్, సాహిల్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు

- వంద పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు పంపండి
- సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నిజాంసాగర్: జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ లైన్ సమస్యలు, సాగు నీటి ప్రాజెక్టులు, వైద్య ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, మిషన్ భగీరథ, అటవీ భూముల ఆక్రమణ, మహిళా సంఘాలకు రుణాలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అదనపు సబ్‌స్టేషన్లు నిర్మించాలన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ కాల్వల నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ పనుల పరిపాలన అనుమతులు మంజూరు చేయాలన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలపై నివేదిక అందించాలని ఆదేశించారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను ఈనెల 9 నాటికి అందిస్తే తదుపరి క్యాబినెట్ సమావేశంలో ఆమోదించేలా చూస్తానన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి, ట్రామా కేర్‌సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీఎంఎఫ్‌టీ నిధులను ఆస్పత్రిలో అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు, పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు వినియోగించాలని కలెక్టర్‌కు సూచించారు.



బిచ్కుందలో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కాంగ్రెస్ నాయకులు

‘మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలి’



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్

కామారెడ్డి అర్బన్: జిల్లాలో మహిళా సంఘాలు ప్రభుత్వం ఇస్తున్న సహకారంలో మరింతగా ఆర్థికాభివృద్ధి చెందాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ సూచించారు. సోమవారం శ్రీలక్ష్మి నర్సింహ జిల్లా మహిళా సమాఖ్య, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల ఆధ్వర్యంలో కామారెడ్డి మండల సమాఖ్య భవనంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో చందర్ నాయక్ మాట్లాడుతూ మహిళలు పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తుల తయారీ, మహిళా శక్తి క్యాంటిన్లు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతేడాది జిల్లాలో కొత్తగా 8,800 మంది సభ్యులుగా చేరారన్నారు. స్కూల్ యూనిఫాంలు కుట్టడం, కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం ద్వారా రూ.3 కోట్ల ఆదాయం వచ్చిందని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప తెలిపారు. 2025–26 ప్రణాళికలో భాగంగా పెట్రోలు బంక్‌లు, గోదాములు, రైస్ మిల్లులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ ద్వారా ఆదాయం పొందాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. రూ. 5 కోట్లతో చేపట్టిన జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. దివ్యాంగ, వృద్ధ, కిశోర మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని, మహిళలకు రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో విజయలక్ష్మి, సమాఖ్య జిల్లా కార్యదర్శి రాజమణి, కోశాధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘ఆత్మ’కు ఏమయ్యింది!?

- అన్నదాతలకు ఉపయోగపడని పథకం
- నిధులు కేటాయించి మనుగడలోకి తేవాలని కోరుతున్న రైతులు

ఎల్లారెడ్డి: వ్యవసాయ రంగంలో సమగ్రాభివృద్ధి సాధించేందుకు, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి చైతన్యవంతులను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) పథకం నిర్వీర్యమవుతోంది. నిధులు లేకపోవడంతో ఆత్మ కార్యక్రమాలు ఎక్కడా కనిపించడం లేదు.

పథకం ఇలా..

ఈ పథకం అమలు కోసం ఏడీఏ పరిధిని ఒక బ్లాక్‌గా నిర్ణయించారు. ప్రతి బ్లాక్‌కు ఒక చైర్మన్ ఉండేవారు. జిల్లా కమిటీలో జిల్లా చైర్మన్‌ను అనుసంధానంగా డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉండగా, బ్లాక్ చైర్మన్‌కు అనుసంధానంగా ఏడీఏ ఉన్నారు. ఏడీఏ పరిధిలోని రైతులకు పలు అంశాలలో అవగాహన కల్పించేందుకు బ్లాక్ లెవల్ ఫార్మర్స్ అడ్వయిజరీ కమిటీలను ఏర్పాటు చేసేవారు.

రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని కల్పించేందుకు క్షేత్ర స్థాయి ప్రదర్శనలు, సదస్సులు, పొలం బడులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్దకు పర్యటనలు నిర్వహించేవారు. ఈ కార్యక్రమాల వల్ల తెలుసుకున్న అంశాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడేవి. ఈ పథకంకోసం కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా నిధులను కేటాయించేవి. అయితే దశాబ్ద కాలంగా నిధులు మంజూరు కాకపోవడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.



ఎల్లారెడ్డిలోని వ్యవసాయ కార్యాలయం

మూస పద్ధతుల్లోనే సాగు..

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 5 లక్షలకు పైచిలుకు ఎకరాలలో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో మూడు లక్షలకుపైగా ఎకరాలలో వరి పంటే సాగవనుంది. అది కూడా మూస పద్ధతుల్లోనే.. చాలావరకు రైతులకు అవగాహనలేక ఆధునిక సాగు పద్ధతులు అవలంబించడం లేదు. ఆత్మ పథకం క్రియాశీలకంగా అమలై ఉండి ఉంటే రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన ఏర్పడే అవకాశాలుండేవి. పాడి, కోళ్ల, గొర్రెల పెంపకం పైనా అవగాహన పెరిగేది. దీంతో వ్యవసాయం లాభదాయకంగా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఆత్మలాంటి కార్యక్రమాలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే ఆత్మ పథకం నిధులు లేక ఉపయోగపడడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ఈ పథకాన్ని పునర్ వ్యవస్థీకరించనున్నారు.

– తిరుమల ప్రసాద్, డీఏవో

ఇంటర్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి
- రూ. 3.28 కోట్లతో కళాశాలల అభివృద్ధికి చర్యలు
- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం



సాక్షి ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. లెక్చరర్ల కొరత లేకుండా చూశామని, అడ్మిషన్లపైనా దృష్టి సారించామని పేర్కొన్నారు. ఇంటర్ ప్రవేశాల గడువు ఈనెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రవేశాలపెంపు, ఫలితాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలపై ‘సాక్షి’ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

6 వేల అడ్మిషన్లు లక్ష్యం..

ఈ విద్యాసంవత్సరంలో 6 వేల అడ్మిషన్ల లక్ష్యంతో సాగుతున్నాం. ఇందుకోసం లెక్చరర్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థిని కలిశారు. దీంతో ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 50 శాతం ప్రవేశాలు జరిగాయి. మిగిలిన లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత చదువుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అర్హులైన, అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారు. అర్హులకు స్కాలర్‌షిప్ కూడా వస్తుంది. ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువుంది. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి.

లెక్చరర్ల కొరత లేదు..

జిల్లాలో 242 మంది రెగ్యులర్ లెక్చరర్లతో పాటు 58 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు ఇప్పటికే అన్ని కళాశాలలకు చేరాయి. మధ్యాహ్న భోజనం పథకం గురించి ఇంకా ప్రభుత్వంనుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు.

- ప్రభుత్వం సర్కారు కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, అవసరమైన మరమ్మతులు, భవనాల నిర్మాణం కోసం రూ. 3.28 కోట్లు మంజూరు చేసింది. ఆయా పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఈ నిధులలో కళాశాలు అభివృద్ధి కానున్నాయి. అలాగే విద్యార్థులకు క్రీడల కోసం ప్రతి కళాశాలకు రూ. 10 వేల చొప్పున నిధులు వచ్చాయి.

ప్రణాళికబద్ధంగా..

గత విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫలితాలు నిరాశకు గురి చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి మంచి ఫలితాలను సాధించేందుకు ప్రణాళికబద్ధంగా సాగుతున్నాం. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నాం. తరచూ వారితో సమావేశాలు నిర్వహించి, ప్రగతిని తెలుసుకుంటాం. అలాగే పది మంది విద్యార్థుల బాధ్యతను ఒక లెక్చరర్‌కు అప్పగించి వారిపై దృష్టిపెడతాం. ప్రతినెల ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి, మార్కులు తక్కువ వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఈసారి విద్యార్థులకు ఏప్‌సెట్, జేఈఈ, ఐఐటీ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఫీజుల విషయంలో..

ప్రైవేట్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజు రూపేణ ప్రథమ సంవత్సరానికి రూ. 1,760, ద్వితీయ సంవత్సరానికి రూ. 1,940 ఫీజు మాత్రమే వసూలు చేయాలి. వసతి, ఇతర సదుపాయాలు, ఆయా శిక్షణల కోసం కాలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ తీర్మానం మేరకు ఫీజులు వసూలు చేస్తే ఆ అంశం మా పరిధిలోకి రాదు. అనుమతులు ఒకచోట తీసుకుని, మరోచోట తరగతులు, కోచింగ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- ఈసారి జిల్లాలోని 20 కళాశాలల్లో అన్ని తరగతి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వాటి సాయంతో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులే తరగతులను మానిటరింగ్ చేస్తారు. జిల్లా కేంద్రం నుంచి నేను కూడా పర్యవేక్షిస్తా.

● నాట్లేసి నిరసన



జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు దెబ్బతినడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నూతన రోడ్డు వేయాలని, కనీసం మరమ్మతులైనా చేయాలని కాలనీవాసులు కోరుతున్నా అధికారులనుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో సోమవారం కాలనీవాసులు రోడ్డుపైన ఏర్పడివన గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు దెబ్బతిని ఏడాదిన్నర గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గుంతల దారిలో ప్రయాణించడం కష్టంగా ఉందన్నారు. రోడ్డు సమస్యపై మున్సిపల్ అధికారులతోపాటు కలెక్టర్‌కు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రోడ్డు వేసి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అర్కల ప్రభాకర్ యాదవ్, కాలనీవాసులు జగదీష్ యాదవ్, శ్రీనివాస్, గంగారాం యాదవ్, దినేష్‌రెడ్డి, నరేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజావాణితో సమస్యల పరిష్కారం


సదాశివనగర్‌లో పాల్గొన్న అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రజావాణితోనే సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆస్కారం ఉంటుందని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, సీహెచ్‌వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!



భిక్కనూరు: సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని భిక్కనూరు ఎస్సై అంజనేయులు సూచించారు. సోమవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రజా కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కు.. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. యూట్యూ బ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్, పోలీస్ కళాబృందం ఇన్చార్జి, హెడ్‌కానిస్టేబుల్ రామంచ తిరుపతి, శేషారావులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం ఉత్సవాలు



సాక్షి నెట్‌వర్క్: మత సామరస్యానికి ప్రతీకగా పల్లెల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పీర్ల పండుగ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. నెల వంక కనిపించగానే ఆశీర్‌ఖానాల్లో కొలువుదీరిన పీర్లను ఆయా గ్రామాల మొల్లాలు, ఫకీర్లు, దూదేకుల కులస్తులు ఒక్కోరోజు ఒక్కోపీరును బంగారు, వెండి ఆభరణాలు, మల్లెపూలు, రంగురంగుల దట్టీలతో అందంగా అలంకరించి ఊరేగించారు. సోమవారం మొహర్రం ముగింపు ఉత్సవాల సందర్భంగా అన్ని పీర్లను బాజా భజంత్రీల నడుమ ఊరేగించగా ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. ఒడిబియ్యం పోసి సారెలు సమర్పించారు. వర్షంలోనూ అసయ్ దూలా, మజ్నూ ఆటపాటలతో భక్తులు ఆకట్టుకున్నారు. సాయంత్రం పీర్లను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలుచోట్ల ప్రత్యేకంగా పాలతో చేసిన షర్బత్‌ను పంపిణీ చేశారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్
- ప్రజావాణికి 107 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను, ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 107 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, పోడు పట్టాలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలను ఏర్పాటు చేయండి


ఫిర్యాదు చేస్తున్న ఆర్‌టీఐ ప్రతినిధి రవీందర్

భిక్కనూరు: మండలం కేంద్రంలోని కుమ్మర్‌గల్లీ ప్రాంతంలో వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ సోమవారం భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు. వీధి దీపాల విషయమై జీపీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మురికి నీటితో అవస్థలు



ఇళ్ల మధ్య మురికి నీరు నిల్వ ఉండటంతో అవస్థలు పడుతున్నామని గాంధారిలోని 2వ వార్డు ప్రజలు తెలిపారు. సోమవారం వారు కలెక్టరేట్‌కు విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీ చివర్లో మురికి కాలువ నిండిపోయి ప్రవాహం నిలిచిపోయిందన్నారు. దీంతో కాలనీలోని ఖాళీ స్థలాల్లోకి మురికి కాలువల నీరు చేరుతుందని తెలిపారు. గ్రామ పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో విన్నవించారు.

పోడు పట్టాలకు రుణాలు ఇవ్వాలి


పోడు రైతులతో కలెక్టరేట్‌కు తరలివచ్చిన సీపీఎం నాయకులు

పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పోడు సాగుదారులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సీపీఎం జిల్లా నాయకులు మోతీరాం, వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ.. జిల్లాలో 12 వేల మంది పోడు సాగుదారులు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని బ్యాంకర్లు పోడు పట్టాలకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. పోడు రైతులు తమ పంట పెట్టుబడుల కోసం ప్రైవేటుగా అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ఇతర జిల్లాలలో పోడు పట్టాలకు ఇచ్చిన మాదిరిగానే మన జిల్లాలో కూడా రుణాలు ఇప్పించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా గాంధారి మండలం మాతు సంగెం గ్రామంలోని కొందరు పెద్ద మనుషులు రైతులను బెదిరించి ఆ భూమి నుంచి వెళ్లగొడుతున్నారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించి రైతులకు పట్టాలు ఇప్పించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

అసంపూర్తిగా అండర్‌బ్రిడ్జి నిర్మాణం

- బ్రిడ్జిలోకి చేరుతున్న మురికి నీరు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని స్థానికుల వినతి


తలమడ్లలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా పనులు నత్తనడకనే కొనసాగుతున్నాయి. అండర్ బ్రిడ్జి పరిధిలోని గ్రామ డ్రైనేజీ తొలగిపోవడంతో మురికి నీరంతా బ్రిడ్జిలోకి చేరి వాహనదారులకు ఇబ్బందకరంగా మారింది. మరో వైపు మిషన్ భగీరథ పైపు లైన్ పనులు కొనసాగుతుండటంతో వాహనదారులకు మరింత ఇబ్బందికరంగా మారింది.

అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే..

కాంట్రాక్టర్, స్థానిక గ్రామ పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే ఈ ఇబ్బంది తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపించడంతో నిత్యం నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మహిళా శక్తి సంబురాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తి సంబురాలను నిర్వహించనున్నట్లు ఏపీఎం రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని సమాఖ్యల ప్రతినిధులు విధిగా సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


దోమకొండలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, కళాశాల ప్రిన్సిపల్ తదితరులు

దోమకొండ: మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో ప్లాంటేషన్ డే కార్యక్రమం నిర్వహించి మొక్కలను నాటారు. ఎంపీడీవో ప్రవీన్‌కుమార్, ఏపీవో రజని, పంచాయితీ కార్యదర్శి యాదగిరిగౌడ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మ పేరు మీద ఒక మొక్క

బీబీపేట: వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఉప్పర్‌పల్లిలో ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద అనే పేరుతో ప్రభుత్వం మొక్కలు నాటాలని పిలుపునిచ్చిందని.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలను సోమవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అచ్చాయపల్లిలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామశివారులోని చెరువుకట్టపై ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు, ఎక్సైజ్ అధికారులు స్రవంతి, లావణ్య, రజిత, రవి, సంజీవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫీల్డు అసిస్టెంటులు, గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 60 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉందన్నారు. రెండు రోజుల్లో లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలలో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీవో సవిత, ఏపీవో కృష్ణగౌడ్, తదితరులుపాల్గొన్నారు.

రుద్రూర్‌కు ఆ పేరు ఎలా వచ్చిందంటే..


రుద్రూర్ ప్రధాన ద్వారం


గ్రామంలోని బురుజు

మీకు తెలుసా?

రుద్రూర్: కాకతీయుల కాలంలో రాణీ రుద్రమదేవి వంశీయులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినందున గ్రామానికి రుద్రూర్‌గా పేరు వచ్చింది.

- రాణీ రుద్రమదేవికి సంబంధించిన సైనిక స్థావరం రుద్రూర్‌లో ఉండేదని గ్రామపెద్దలు చెబుతున్నారు.
- గ్రామానికి మూడు వైపుల బురుజులు (గడి)లు, ఒక వైపు చెరువు ఉంది. కాలక్రమేణ రెండు అంతరించిపోగా రాతితో నిర్మించిన ప్రధాన ద్వారం చెక్కు చెదరకుండా ఉంది.
- గ్రామం మధ్యలో రాతితో కట్టిన పెద్ద పురాతన కోట (బురుజు) ఉంది. ఇందులో కాకతీయుల సైనిక స్థావరం ఉండేది. ఇక్కడి నుంచి సొరంగ మార్గం (బావి) రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం వరకు ఉన్నట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.
- కాకతీయుల కాలంలో రాతితో నిర్మించిన రాజరాజేశ్వర ఆలయం ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంది.

‘జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం’


దత్తురెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న మంత్రి కోమటిరెడ్డి

పిట్లం(జుక్కల్): జర్నలిస్ట్ జీడిపల్లి దత్తురెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. మద్దెలచెర్వు గ్రామానికి చెందిన దత్తురెడ్డి(37) ఇటీవల గుండెపోటుతో మరణించారు. సోమవారం మద్దెలచెర్వు గ్రామానికి మంత్రి కోమటిరెడ్డి వెళ్లి దత్తురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నల్లగొండలో సుదీర్ఘకాలం పని చేసిన దత్తురెడ్డి జిల్లా అభివృద్ధికి తన కథనాల ద్వారా ఎంతో సహకారం అందించారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా దత్తురెడ్డి భార్య ప్రియాంకకు ఔట్ సోర్సింగ్ ద్వారా ఇద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, పట్లోళ్ల సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే దత్తురెడ్డి కుటుంబ సభ్యులను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.

వైద్య విద్యార్థి కుటుంబసభ్యులకు పరామర్శ

మద్నూర్: డోంగ్లీ మండలం కుర్లా గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి వడ్ల యోగేష్(23) ఈ నెల 2న ఫిలిప్పిన్స్ దేశంలో గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. యోగేష్ మృతదేహం ఫిలిప్పిన్స్ నుంచి సోమవారం కుర్లా గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గానికి వచ్చిన మంత్రి కోమటి రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు యోగేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


రాజంపేటలో వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జెండాలను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. రాజంపేటలో ఎంఆర్‌పీఎస్ కామారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంథని సామ్యేల్ మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని వ్యాఖ్యానించారు.

పురుగుల అన్నం మాకొద్దు

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- గిరిజన గురుకుల విద్యార్థినుల డిమాండ్
- ఎల్లారెడ్డి రహదారిపై రాస్తారోకో


ఎల్లారెడ్డిలో రాస్తారోకో చేస్తున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు


గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

ఎల్లారెడ్డి: అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఎలా తినాలంటూ ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అన్నంలో, జావాలో, శనగలలో పురుగులు వస్తున్నాయన్నారు. ఇంటర్ విద్యార్థులకు బాటనీ లెక్చరర్ లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. వారిని సముదాయించి, పాఠశాలకు తీసుకువెళ్లారు. విషయం కలెక్టర్‌కు తెలియడంతో వెంటనే అడిషనల్ కలెక్టర్ విక్టర్‌ను విచారణకు పంపారు. ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని బంజారా సంఘం నాయకులు అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు. ఆర్‌సీవో గంగారం, ఎంఈవో రాజులు, మున్సిపల్ కమీషనర్ మహేష్‌కుమార్ తదితరులున్నారు.

దాడి ఘటనలో ఇద్దరి అరెస్టు

భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఇటీవల భూతగాదాల కారణంగా వడ్ల పెద్ద అంజయ్యపై దాడిచేసిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు సోమవారం తెలిపారు. అంజయ్యపై దాడి చేసి గాయపరిచిన వడ్ల స్వామితోపాటు ఆయన కుమారుడైన వడ్ల సత్యంను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ధర్నా


ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు, విద్యార్థులు

కామారెడ్డి టౌన్: ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పలువురిని అనుమతి ఇవ్వడంతో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాందాస్, సాయికుమార్, శ్రీకాంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

9న ఓరియంటేషన్ ప్రోగ్రాం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 9న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. డిగ్రీలో చేరిన కొత్త విద్యార్థులందరు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరైతే కళాశాల, అధ్యాపకులు, బోధన పద్ధతులు, పరీక్షలు పాటు అనేక ముఖ్య విషయాలు అర్థమవుతాయని ఆయన పేర్కొన్నారు.

12న తెరవే ‘పాటకు సలామ్’ కార్యశాల

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో ఈ నెల 12న యువ గాయని గాయకులను ప్రోత్సహించే ఉద్దేశంతో ‘పాటకు సలామ్’ కార్యశాల కార్యక్రమాన్ని స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెరవే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్‌లు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెరవే ప్రతినిధులు మట్లాడారు. పాల్గొన్న యువ గాయకులందరికి ప్రశంసాపత్రాలు, మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులుంటాయని వారు పేర్కొన్నా రు. ఆసక్తిగల వారు 98490 62038 నంబర్‌కు తమ వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తెరవే ప్రతినిధులు కాసర్ల రామచంద్రం, యెంబరి లింగం, వై.గంగాప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్ల వసూలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు వసూలు చేసినట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. అలాగే పలువురికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. కానిస్టేబుల్ కనకయ్య, శ్రీనివాస్, రాజు, లక్ష్మణ్, రవి, మదన్‌తో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- భర్త మృతి, భార్యకు గాయాలు


మృతి చెందిన రాములు

బోధన్‌టౌన్(బోధన్): ఎడపల్లి మండలం దూపల్లి గేట్ సమీపంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ముత్యాల రమ తెలిపిన వివరాలు ఇలా.. రెంజల్ మండలం బాగెపల్లి గ్రామానికి చెందిన దంపతులు వాద్యాల రాములు(54), ఇంద్ర కలిసి సోమవారం ద్విచక్ర వాహనం (టీవీఎస్ చాంప్)పై నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. దూపల్లి గేట్ వద్ద వారు రోడ్డు దాటుతుండగా బోధన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న కారు వారిని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో భర్త వాద్యాల రాములు అక్కడికక్కడే మృతి చెందగా భార్య ఇంద్రకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ఇంద్రను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో పెద్దవాల్గోట్ వాసి ..


రవీందర్ (ఫైల్)

సిరికొండ: మండలంలోని వాల్గోట్ గ్రామానికి చెందిన వడియాల రవీందర్ (38) ఈ నెల 4న గల్ఫ్ దేశమైన దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకు దెరువు కోసం కొద్ది సంవత్సరాలుగా రవీందర్ దుబాయ్‌కి వెళ్తున్నాడు. సెలవుపై ఏడాది క్రితం ఇంటికి వచ్చి, వెళ్లాడు. రోజూలాగే డ్యూటీకి వెళ్లివచ్చి రూమ్‌కు విశ్రాంతి తీసుకుంటున్న రవీందర్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే తోటి స్నేహితులు హాస్పిటల్‌కు తరలించే లోపే మృతి చెందాడు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించాలని కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామ శివారులో సోమవారం ఉదయం గూడ్స్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిజామాబాద్ రైల్వే పోలీస్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజరు హరికృష్ణ తెలిపిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడు ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతోనే గూడ్స్ రైలు రాకను గమనించి పట్టాలపై పడుకోగా, అతడిపైనుంచి రైలు వెళ్లిందన్నారు. దీంతో అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడిని గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

అందరు ఉన్నా.. అనాథలా మృతి

- గతనెల 28న రోడ్డు ప్రమాదంలో గాయపడిన అశోక్
- ఆస్పత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారమిచ్చిన అంబులెన్స్ సిబ్బంది
- తమ కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన తండ్రి
- దర్యాప్తు చేయడంలో పోలీసుల నిర్లక్ష్యం
- చికిత్స పొందుతూ మృతి


కొరబోయిన అశోక్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా కుటుంబసభ్యులకు సమాచారం లేకపోవడంతో అనాథలా మృతిచెందాడు. మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన కొరబోయిన అశోక్(32) మేస్త్రీ పని చేస్తుండేవాడు. అతడు కొన్నేళ్ల క్రితమే లింగంపేట్ మండలం నుంచి అర్గుల్ గ్రామానికి కుటుంబంతో వలస వచ్చి, జీవనం కొనసాగిస్తున్నాడు. గత నెల 28న రాత్రి అతడు జక్రాన్‌పల్లిలో స్నేహితుడిని కలిసి వస్తానని బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో మరుసటి రోజు తండ్రి ప్రభురాజ్యం జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశాడు. జిల్లాకేంద్ర ఆస్పత్రిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందగా ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుడు అశోక్‌గా గుర్తించి, ప్రభురాజ్యంకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడు ఆస్పత్రికి చేరుకొని మృతిచెందినది తన కుమారుడే అని బోరున విలపించారు.

బైక్‌ను ఠాణాకు తరలించారు.. విచారణ మరిచారు..

ఆస్పత్రిలో వారం రోజులుగా ఎవరూ లేని అనాథలా చికిత్స పొందుతున్న అశోక్ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. 28న రాత్రి జక్రాన్‌పల్లి సర్వీసు రోడ్డులో ఒక యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడిపోగా చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మరుసటి రోజు పోలీసులు బైక్‌ను ఠాణాకు తరలించారు. అయితే ఆ ఘటనలో గాయపడ్డవారు ఎవరు? అని పోలీసులు వివరాలు సేకరించడంలో నిర్లక్ష్యం వహించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టినట్లయితే అతడు ప్రాణాలతో ఉండేవాడని అర్గుల్‌కు చెందిన ఓ మాజీ ప్రతినిధి పేర్కొన్నారు. అశోక్‌ను ఆస్పత్రిలో చేర్చినప్పటికీ అతనికి సంబంధించిన వ్యక్తులు లేకపోవడం వల్ల వైద్యులు సైతం వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. స్వల్ప గాయాలైన వ్యక్తి మరణించడంపై అనుమానంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై ‘సాక్షి’ జక్రాన్‌పల్లి ఎస్సైను వివరణ కోరేందుకు యత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.